
మల్లంపేట్‌లో అక్రమ విల్లాలను కూల్చివేస్తున్న హైడ్రా..


# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 9 సెప్టెంబర్ 2024 | పేజీలు 8


# మల్లంపేట్ కత్వ చెరువులో..
# 'హైడ్రా' కూల్చివేతలు

- ఎఫ్‌టిఎల్, బఫర్‌లో 27 అక్రమ నిర్మాణాలు గుర్తించి ఇరిగేషన్ మార్కింగ్..
- ఆదివారం రాత్రి వరకు 15 విల్లాలు డిమాలిషన్ చేసిన హైడ్రా.. మిగతా విల్లాలు రెండు వారాల గడువు..

ఆదివారం రాత్రి వరకు హైడ్రా చర్యలు..



రెవెన్యూ, ఇరిగేషన్,మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం ఆదివారం మల్లంపేట్‌లో హైడ్రా కూల్చివేతలు.. కత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ ఆక్రమించి లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థ" అక్రమ విల్లాలు నిర్మించారు.. ఆదివారం అక్రమ విల్లాలపై హైడ్రా కూల్చివేతలు చేపట్టింది.. తెలియక కొనుగోలు చేసినవారికి అవగాహన కల్పించాల్సిన అధికారులు.. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్న" చందంగా తయారైంది.. ఆరంభం నుండి సహకరించే ధోరణితోనే వ్యవహరించిన అధికారులకు బాధితులకు ఏం సమాధానం చెబుతారు.. గత పాలకుల సిఫార్సులతో, బిల్డర్ విజయలక్ష్మీకి మూడు శాఖల అధికారులు సహకరించకుండానే పరిస్థితి ఇంతవరకు వచ్చిందా..? ఉన్నతాధికారులు కూడా "తానా తందానా" అంటూ తాళం వేయడం వల్లనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.. 2021 నవంబర్ 18న అప్పటి కలెక్టర్ ఎస్.హరీష్ ఆదేశాలు ఉత్తుత్తివేనా..? 2022 అక్టోబర్ 3న హైకోర్టు ఉత్తర్వులతో 208 విల్లాలు నిషేధిత జాబితాలో పెట్టారు..? అదీ కూడా ఉత్తుత్తిదేనా..? అధికారుల నోటీసులు ప్రజలను మభ్య పెట్టేందుకేనా..? అధికారుల విధులు నాడు సక్రమంగా ఉండి ఉంటే..? నేడు "ఆపరేషన్ హైడ్రా" కూల్చివేతల పని ఉండేదా..?


మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 08:





-2లో


- మల్లంపేట్ "లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్"లో విల్లాలు కూల్చివేస్తున్న 'హైడ్రా'..
- బిల్డర్ విజయలక్ష్మి మాయ మాటలతో మోస పోయిన విల్లావాసులు..
- కత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ కబ్జాచేసి విల్లాల నిర్మాణం..
- అక్రమ విల్లాల నిర్మాణంలో ఎవరిని నిందించాలి..? రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ పాత్ర లేదా..?
- రెవెన్యూ, ఇరిగేషన్, ఇన్ని సంవత్సరాలు విధుల్లోనే ఉన్నారు కదా..! ఏం చర్యలు తీసుకున్నారు..?
- కొనుగోలు దారుల నుండి బిల్డర్‌కు కోట్లు ముట్టేంత వరకు అధికారులు మౌనం వహించడంలో అర్థం..
- 2021 నవంబర్ 18న అప్పటి మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ చర్యలకు ఆదేశించారు..
- 260 అక్రమ విల్లాలు ఉన్నట్లు కలెక్టర్ ఆనాడే పేర్కొన్నప్పటికీ..! అధికారుల చర్యలేవి..?
- హైకోర్టు ఉత్తర్వులతో 2022 అక్టోబర్ 3న 208 విల్లాలు నిషేధిత జాబితాలో పెట్టారు..!
- హైడ్రా అనేదే లేకపోతే..? చెరువులను కబ్జాలకు అప్పగిస్తారా..?

## ఖమ్మం వరద ప్రభావిత ప్రాంతాల్లో..
# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి..

- ప్రధానమంత్రి ఆదేశాలతో బాధితుల పరామర్శించి పరిస్థితుల పరిశీలన..
- సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన తిరుమలాయపాలెం మండలం రాకాసి తాండా..
- జిల్లా దంచాలపురంలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి..
- వరద ముంపు ప్రాంతాలు దంసాల పురంలో పర్యటించి బాధితులను పరామర్శించారు..


-3లో




# పేరుకేమో ప్రజా ప్రభుత్వం...
# కూల్చేదేమో నిరుపేదల ఇళ్లు

- హైదరాబాదులో కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు
- పలు చెరువుల్లో నిర్మాణాల తొలగింపు
- ప్లాస్టిక్ షీట్లతో వర్షం నుంచి తలదాచుకుంటున్న వీడియో పంచుకున్న కేటీఆర్


-4లో






# మల్లంపేట్ కత్వ చెరువులో.. 'హైడ్రా' కూల్చివేతలు..





## అక్రమ విల్లాలతో కోట్లు గడించిన బిల్డర్ విజయలక్ష్మీ..

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్‌లో లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ బిల్డర్ విజయలక్ష్మి కొనుగోలు దారులను ధారుణంగా బురిడి కొట్టించింది.. గేటెడ్ కమ్యూనిటీ పేరుతో అరచేతిలో వైకుంఠం చూపించింది అనడంలో అతిశయోక్తి కాదు.. హెచ్‌ఎండిఏ అనుమతులు తీసుకున్నది 60 మాత్రమే, 260 అక్రమ విల్లాలు ఉన్నట్లు..! స్వయంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ 2021లోనే విచారణలో తేల్చిన విషయం తెలిసిందే.. మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3, 170/4, 170/5 సర్వే నెంబర్‌లలో 12-15 ఎకరాలు మాజీ సైనికులకు చెందిన స్థలాన్ని కొనుగోలు చేసి, అందమైన బ్రోచర్‌లతో కస్టమర్‌లని బోల్తా కొట్టించిందని 2021లోనే స్పష్టమైంది.. ఎన్‌ఆర్‌ఐ విజయలక్ష్మీ తన తెలివితేటలకు, రాజకీయ నేతల అండతోడై..! సంబంధిత శాఖల అధికారులను మచ్చిక చేసుకుని, ఆ పక్కనే ఉన్న మల్లంపేట కత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ స్థలానికి ఎసరు పెట్టడం గమనార్హం.. గతంలో 7 విల్లాలు మాత్రమే ఉన్నాయని చెప్పిన ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు తాజాగా 27 విల్లాలు గుర్తించడం పలు అనుమానాలకు తావిస్తోంది..

**మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కంపెనీ మోసం ఏ కొద్దిపాటిదో కాదు..! ఒక్క కత్వ చెరువు కబ్జా మాత్రమే అయితే 27 విల్లాల కూల్చివేతలతో సరిపోతుంది..! కానీ అదనంగా మరికొంత ప్రభుత్వ స్థలం కబ్జాకూడా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఓ ప్రైవేటు సర్వేలోనూ 19-10 గుంటల స్థలంలో విజయలక్ష్మి విల్లాలు ఉన్నట్టు తేల్చారు.. ఇదిఇలా ఉండగా 260 అక్రమ విల్లాలుగా 2021 నవంబర్ 18న కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు.. ఇన్ని విధాలుగా అక్రమ కట్టడాలను తేల్చిన అధికారుల చర్యలు ఆ నాడే స్తంభించాయి.. కారణం ఏమైనప్పటికీ..! కొనుగోలు దారుల నుండి, బిల్డర్‌కు డబ్బులు చెల్లించేందుకే, అధికారులు ఈ జాప్యం వహించినట్లు తెలుస్తోందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..**

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం మల్లంపేట్‌లో ఆదివారం హైడ్రా కూల్చివేతల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది.. "లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థ" యాజమాన్యం బిల్డర్ విజయలక్ష్మీ గత నాలుగేళ్లుగా చేస్తున్న అక్రమాలకు 'హైడ్రా' పంజా విసిరింది.. గతనెల(ఆగష్టు) 14న మల్లంపేట్ కత్వ చెరువు లేక్‌ఐడి నెం:2830ను హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన టీమ్‌తో సందర్శించారు.. పలుమార్లు హైడ్రా టీమ్ విచారణ జరిపిన అనంతరం.. భారీగా పోలీసులతో మోహరించిన హైడ్రా అధికారులు.. ఆదివారం ఉదయం 6 గంటలకు కూల్చివేతలు ప్రారంభించారు.. ఈ కూల్చివేతల్లో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. కత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ స్థలం ఆక్రమణలో 27 విల్లాలు ఉన్నాయని, ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ చేశారు.. అయితే కొందరు విల్లాల్లో నివాసం ఉంటున్న కారణంగా.. ఖాళీగా ఉన్న విల్లాలను ఆదివారం రాత్రి వరకు 15 విల్లాలు కూల్చి వేసినట్లు అధికారులు తెలిపారు.. మిగతా విల్లాలకు రెండు వారాలు గడువు ఇస్తూ ఖాళీ చేయాల్సిందిగా విల్లా వాసులను అధికారులు ఆదేశించారు..


హైడ్రా బుల్డోజర్‌లతో కూల్చివేతలు..

## కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి..!

కత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ స్థలాన్ని, ప్రభుత్వ భూమిని ఆక్రమించి విల్లాలను నిర్మించడంపై గతంలోనే విల్లాలను సీజ్ చేశారు.. విల్లాలకు అనుమతులు కూడ లేనట్టు గుర్తించారు.. సందిట్లో సడేమియా అన్నట్లు కొందరు ప్రజాప్రతినిధులు, బిల్డర్‌తో కుమ్మక్క సిఫార్సులు చేసి చర్యలు లేకుండా రక్షించారు..మరోవైపు కస్టమర్‌లు బిల్డర్ మోసపూరిత మాటలకు పడిపోయి, అక్రమ విల్లాలను కొనుగోలు చేశారు. ఒక్కో విల్లా రేటు రూ.కోటి పైమాటే.. కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన బాధితులకు, ఎవరు సమాధానం చెబుతారు..? అక్రమం అని తెలిసినా చర్యలు తీసుకోకుండా వదిలేసిన అధికారులా..? అధికారుల నుండి ఏ ఆటంకం లేకపోవడంతో, అంతా సక్రమమేనని భావించిన కొనుగోలు దారులదే తప్పా..? చివరికి కోట్లు వెచ్చించి కొనుగోలు చేసినవారు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు..


కత్వ చెరువులో మట్టి నింపి విల్లాల నిర్మాణం..


కూల్చివేతలకై విల్లాను ఖాళీచేయిస్తున్న హైడ్రా సిబ్బంది..

# ఖమ్మం వరద ప్రభావిత ప్రాంతాల్లో.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి..







- ప్రధానమంత్రి ఆదేశాలతో బాధితుల పరామర్శించి పరిస్థితుల పరిశీలన..
- సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన తిరుమలాయపాలెం మండలం రాకాసి తాండా..
- చజిల్లా దంచాలపురంలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి..
- వరద ముంపు ప్రాంతాలు దంసాల పురంలో పర్యటించి బాధితులను పరామర్శించారు..

**ఖమ్మం జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 08:** ఖమ్మం జిల్లాలోని పలు ముంపు ప్రభావిత ప్రాంతాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు.. పర్యటనలో భాగంగా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన రాకాసి తండా వాసులను మంత్రులు పరామర్శించారు.. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.. ప్రధాన మంత్రి ఆదేశాలతో మిమ్మల్ని కలవడానికి మిమ్మల్ని పరామర్శించి ఇక్కడ పరిస్థితుల్ని పరిశీలించడానికి వచ్చానని తెలిపారు..

రాకాసితండా గిరిజనులు, వరద విపత్తుల కారణంగా సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలారని, బాధితులకు నష్టపరిహారం అందేలా చూస్తామని మంత్రులు స్పష్టం చేశారు.. పంట పొలాలు పూర్తిగా ధ్వంసమై,పంట పొలాల్లో ఇసుక మెటల్‌గా మారాయని ఆవేదన చెందారు..ఈ కష్ట సమయంలో ఈ గ్రామస్తులకు అండగా నిలవలసిన అవసరం ఉందిని, గ్రామస్తులుకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.. ప్రజల కోరిక మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి ఆమోదం మేరకు రాకాసితండాను సురక్షిత ప్రాంతానికి మార్చే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు..పంట పొలాల్లో ఇసుక మేటను తొలగించి ఆర్థిక సాయం అందించి రైతులు సాగు చేసుకునే విధంగా ప్రభుత్వం సహకరించేలా చర్యలకు ఆదేశాలు.. ప్రజలు ధైర్యంగా ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరద బాధితులకు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు.. మిమ్మల్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వాలు తీసుకుంటాయని ధైర్యాన్ని ఇచ్చారు..

ఖమ్మం జిల్లా దంచాలపురంలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వరద ముంపుకు గురైన దంసాల పురంలో పర్యటించి బాధితులను పరామర్శించారు.. ముంపు బారిన పడ్డ ఇండ్లను మంత్రి స్వయంగా పరిశీలించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు..ఖమ్మంలో ఎన్నడూ లేని విధంగా వరదలు సంభవించాయని, ఈ వరదల్లో ఎంతోమంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.. మున్నేరు వరద బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం పరివాహక ప్రాంతాన్ని వాగు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు..

అనంతరం అగ్రహారం కాలనీ వద్ద ఉన్న కందగడ్ల ఫంక్షన్ హాల్‌లో మున్నేరు వరద బాధితులకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఇది రాజకీయాలు చేసే సమయం కాదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజల కోసం పనిచేస్తాయని ఆయన అన్నారు.. వరదలు సంభవించిన సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వరదలపై ఆరా తీశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం వద్ద అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1345 కోట్లు నిల్వ ఉంచారని వాటిని ప్రజలు కోసం ఖర్చు చేయమని మోదీ ఆదేశించారాని తెలిపారు.. అది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ రాష్ట్రాల వద్ద ఉంచాలని తీర్మానం చేసిందన్నారు..మున్నేరు వరద బాధితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడు అండగా ఉంటాయని అన్నారు. కేంద్ర మంత్రి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు











## పేరుకేమో ప్రజా ప్రభుత్వం... కూల్చేదేమో నిరుపేదల ఇళ్లు: కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు. పేరుకేమో ప్రజా ప్రభుత్వం... కూల్చేదేమో నిరుపేదల ఇళ్లు అంటూ మండిపడ్డారు. జోరువానలో, కనికరం లేకుండా కర్కశంగా పేదల గూడు కూల్చేశారని... దిక్కుతోచని స్థితిలో ఆ అభాగ్యులు ప్లాస్టిక్ కవర్ల నీడలో తలదాచుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇవాళ రేవంత్ సర్కార్ కూల్చిన ఇళ్లలోని నిరుపేదలు వీళ్లు అంటూ ఆ మేరకు ఓ వీడియో పంచుకున్నారు. హైదరాబాదులో పేదలకు పంపిణీ చేసేందుకు బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన 40 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు సిద్ధంగా ఉన్నాయని కేటీఆర్ వెల్లడించారు. ఈ ఇళ్లను వెంటనే పేదలకు కేటాయించాలని తెలంగాణ సీఎస్ ను కోరుతున్నానని, తద్వారా, గూడు కూల్పోయిన పేదలు పడే బాధలను చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మానవీయ దృక్పథంతో పునరావాసంపై నిర్ణయం తీసుకోవాలని, అందరికీ సమ న్యాయం వర్తింపజేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. హైడ్రా ఇవాళ హైదరాబాద్ శివార్లలోని పలు చెరువుల్లో పలు నిర్మాణాలను తొలగించడం తెలిసిందే.

## యూట్యూబ్ ఛానెల్ పెట్టుడు.. ప్రతి ఒకడు జర్నలిస్ట్ అనుడు: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**అసలు జర్నలిస్టుల కంటే కొసరు జర్నలిస్టులు ఎక్కువయ్యారన్నారు సీఎం రేవంత్ రెడ్డి.. నిజమైన జర్నలిస్టులను అగౌరవపరిచే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదన్నారు. ప్రస్తుతం ఎవరు పడితే వారు యూట్యూబ్ ఛానల్ పెట్టుకుని జర్నలిస్టులంటున్నారన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి .. అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు ఇస్తామన్నారు. జర్నలిస్టులు సమస్యలు సృష్టించవద్దన్నారు .ఢిల్లీలో పనిచేసే తెలుగు జర్నలిస్టులకు కూడా వైద్యసదుపాయం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కొంతమంది చిట్ చాట్ లను కూడా బద్నా చేస్తున్నారన్నారు. జర్నలిస్టులు సమాజానికి సేవ చేసే డాక్టర్లు అని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చిక్కుముళ్లను పరిష్కరించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాలకు జర్నలిస్టులకు అనుమతి లేదన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన గౌరవాన్ని పెంచుకోవాలన్నారు. ఈ వ్యవస్థలపై నమ్మకం పెంచడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. జర్నలిస్టులు పార్టీ కార్యకర్తలగా వ్యవహరించవద్దన్నారు. కొన్ని రాజకీయ పార్టీలే పత్రికలు నడుపుతున్నాయన్నారు. సిద్ధాంతాలను ప్రచారం చేసుకొనే పత్రికలు ఎక్కువయ్యాయన్నారు గత పదేళ్లలో తెలంగాణలో ఏ వ్యవస్థకు పాలసీ లేదన్నారు. చిన్న, పెద్ద పత్రికలను ఎలా గుర్తించాలో ఒక నివేదకను తయారు చేయాలన్నారు. ప్రెస్ అకాడమీకి స్పెషల్ ఫండ్ కింద రూ. 10 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో మిగతా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో కమిటీ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఐఎంపీఆర్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాకు రెడ్ అలర్ట్.. మున్నేరుకు పెరుగుతున్న వరద.. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఖమ్మం జిల్లాకు మరో భారీ వరద గండం పొంచి ఉంది. ఆదివారం వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో... మున్నేరుకు వరద ఉధృతి పెరిగింది. బయ్యారం, గార్ల చెరువులకు భారీగా వరదనీరు వస్తోంది. మున్నేరు, ఆకేరు భారీగా వరద పెరిగే చాన్స్ ఉంది. దీంతో హై అలర్ట్ జారీ చేశారు అధికారులు.

మున్నేరు వెంట నివసించే దన్వాయిగూడెం, రమణపేట్, ప్రకాశ్ నగర్, మోతీనగర్, వెంకటేశ్వర నగర్ నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రాల్లోకి వెళ్లాలని సూచించారు. ఇప్పటికే పరివాహక ప్రాంతాల ప్రజలను పునరావస కేంద్రాలకు తరలిస్తున్నారు.

గత వారం భారీ వర్షం, వరదలతో మున్నేరు పరివాహక ప్రాంతం మునిగిపోయింది. ఇప్పటికే ఉన్నదంతా పోయి కట్టుబట్టలతో మిగిలిపోయారు బాధితులు. ఇప్పుడు మరో సారి భారీ వర్షం, వరద ఎఫెక్ట్ తో బిక్కు బిక్కుమంటున్నారు. రాత్రి పునరావస కేంద్రాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, సీపీ సునీల్ దత్ తో కలిసి పరిశీలించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ముంపు బాధితుల కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారిని పరామర్శించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పారు భట్టి.

ఖమ్మం జిల్లాలో భారీ వర్షపాతం నమోదు కావటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. జిల్లా మంత్రులు తుమ్మల, పొంగులేటి .... మున్నేరు పరివాహక ప్రాంతం నుంచి ప్రజలను ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

# తెలంగాణలో వరద నష్టం ఎంతంటే...!

### తెలంగాణలో పలు జిల్లాలను అతలాకుతలం చేసిన వరదలు

### రూ.5,438 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రాథమిక నివేదిక

### తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలన్న రేవంత్ సర్కారు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల వరదలు సంభవించిన నేపథ్యంలో, కేంద్ర సాయం పొందేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరద నష్టంపై ప్రాథమిక నివేదిక రూపొందించింది. రూ.5,438 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రేవంత్ సర్కారు తన నివేదికలో వెల్లడించింది. ప్రధానంగా... రోడ్లు భవనాల శాఖ పరిధిలో రూ.2,362 కోట్లు, విద్యుత్ శాఖ పరిధిలో రూ.175 కోట్లు, పంటలు రూ.415 కోట్లు, నీటిపారుదల శాఖ పరిధిలో 629 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, తాగునీటి శాఖ పరిధిలో రూ.170 కోట్లు, మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,150 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం తన నివేదికలో పొందుపరిచింది. తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది.





వారం రోజులుగా అతలాకుతలం చేసిన వరదల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుకుంటుండగా, వాస్తవంగా జరిగిన నష్టం ప్రభుత్వం పేర్కొన్న దాని కంటే ఎక్కువే ఉండొచ్చని భావిస్తున్నారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాతే వరద నష్టంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఇటీవలి వరదల్లో ఖమ్మం, మహబూబాబాద్, మరి కొన్ని జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇళ్లు కోల్పోయి, పంటలు నష్టపోయి, పశువులు, ఇతర జీవనాధారాలు కోల్పోయిన ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పడి ఇద్దరు గల్లంతు



హైదరాబాద్ పెన్ పవర్: నిజామాబాద్ జిల్లాలో విషాదం నెలకొంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పడి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు..అయితే వారిలో ఒకరు అతికష్టం మీద ఒడ్డుకు చేరుకు న్నారు. మరో వ్యక్తి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. బాధితులిద్దరూ మెట్ పల్లిలోని బంధువుల ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది.. గల్లంతయిన వ్యక్తి ఫెరోజ్ (28) గా గుర్తించారు పోలీసులు. ఆదివారం (సెప్టెంబర్ 8) ఉదయం ప్రాజెక్టును తిలకించేందుకు వచ్చినట్లు తెలుస్తోంది.

## దుండిగల్, మల్లంపేట విల్లాలు కూల్చివేస్తున్న హైడ్రా



హైదరాబాద్ పెన్ పవర్: గ్రేటర్ హైదరాబాద్ చుట్టు పక్కల చెరువును, నాలాలను ఆక్రమించి కట్టిన విల్లాలను కూల్చడానికి హైడ్రా రంగం సిద్ధం చేసింది. దుండిగల్ మున్సిపల్ పరిధిలో మల్లంపేట కత్వ చెరువు %ఖీూ% స్థలంలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వాటిని గుర్తించిన హైడ్రా అధికారులు ఆదివారం (సెప్టెంబర్ 8న) ఉదయం కూల్చివేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ (విజయలక్ష్మి) విల్లాల కూల్చడానికి మిషనరీతోపాటు పోలీసుల బందోబస్తు తీసుకొని అక్కడికి చేరుకున్నారు. మాదాపూర్ లోని సున్నపు చెరువులో 43 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. సున్నపు చెరువులో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. అలాగే బాచుపల్లి బౌరంపేట చెరువు పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూడా హైడ్రా అధికారులు నేలమట్టం చేస్తున్నారు.

## ఖమ్మం కార్పొరేషన్ లో కూల్చివేతలు షురూ..



హైదరాబాద్ పెన్ పవర్:ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు షురూ అయ్యాయి. కార్పొరేషన్ పరిధిలోని 10 డివిజన్ నాలాను ఆక్రమణ చేసి మట్టితో ఫిల్ చేసిన స్థలా న్ని కార్పొరేషన్ అధికారులు తొలగించారు. గత పదిరోజుల నుంచి చెరువును తలపిస్తున్న ఖమ్మం నగరం.. కాల్వల కబ్జా కారణంగా వరద పోటెత్తుతుందని నిర్ధారణకు వచ్చిన అధికారులు.. నాలా ఆక్రమణలు తొలగిస్తున్నారు.

# నిజాంసాగర్ ప్రాజెక్ట్ కు వరద పోటు.. ఐదు గేట్లు ఎత్తివేత



హైదరాబాద్ పెన్ పవర్: నిజాంసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయిన సింగూర్ ప్రాజెక్టు నుంచి రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల విడుదల చేయడంతో ఇన్‌ఫ్లో ఒక్కసారిగా 30వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఐదు గేట్ల ద్వారా 36,500 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేసున్నట్లు ఇరిగేషన్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులకు (17. 802 టీఎంసీలు) 1404.64 అడుగుల (17.282 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని ఆయన వివరించారు. ప్రస్తుతం 17.252 టీఎంసీల నీరు వరద నీరు ఉందని ఆయన తెలిపారు.

**ఎస్సారెస్పీలోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రాజెక్ట్‌లోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థా యి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.ప్రస్తుతం 1090 అడుగుల (76. 894 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. 5,882 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.


# హైదరాబాద్‌లో కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు.. ఆకట్టుకుంటున్న జాక్ క్రషర్.. ఏంటి దీని ప్రత్యేకత?

### వర్షాల కారణంగా వారం రోజులుగా స్తబ్దుగా హైడ్రా

### నేటి తెల్లవారుజాము నుంచే మళ్లీ రంగంలోకి

### కొనసాగుతున్న కూల్చివేతలు

### పెద్దపెద్ద భవనాలను సైతం చిటికెలో కూల్చేస్తున్న సరికొత్త హైడ్రాలిక్ జాక్ క్రషర్



హైదరాబాద్ పెన్ పవర్:వర్షాల కారణంగా గత వారం రోజులుగా నిశ్శబ్దంగా ఉన్న హైడ్రా మళ్లీ కూల్చివేతలు ప్రారంభించింది. ఈ తెల్లవారుజామున మొత్తం 30 బృందాలు రంగంలోకి దిగాయి. దుండిగల్, మాదాపూర్, బోరబండ, బాచుపల్లి, మియాపూర్, సర్వపురి తదితర ప్రదేశాల్లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. అత్యంత అధునాతన హైడ్రాలిక్ జాక్ క్రషర్లు ఉపయోగించి కూల్చివేతలు జరుపుతున్నారు. మాలిక్ డిమాలిషన్ కంపెనీ ఈ కూల్చివేతలు చేపట్టిం ది. కూల్చివేతల్లో కనిపించిన అత్యాధునిక హైడ్రాలిక్ మిషన్ అందరినీ ఆకట్టుకుం టోంది. దీనిని హైడ్రాలిక్ జా క్రషర్ అని పిలుస్తారు. ఇది అత్యంత శక్తిమంతమైనది. ఐదారు అంతస్తుల భవనాలను కూడా రెండు మూడు గంటల్లోనే నేలమట్టం చేసేస్తుంది. అంతేకాదు, ఉన్న చోటు నుంచే 10 అంతస్తులను అమాంతం కూల్చేయగలదు. ఇలాంటి అత్యాధునిక మిషన్లు దేశంలో నాలుగైదు మాత్రమే ఉన్నాయి. మాలిక్ సంస్థలో దాదాపు 500 మంది ఉద్యోగులు న్నారు. 70 మంది ఆపరేటర్లు ఉన్నారు. ఈ మిషన్‌కు హైడ్రా ఒక్క రోజుకు దాదాపు రూ. 5 లక్షలు చెల్లిస్తున్నట్టు తెలిసింది. దాని ఆపరేటర్‌కే సంస్థ నెలకు రూ. 2 లక్షల వేతనం చెల్లిస్తున్నట్టు సంస్థ తెలిపింది.

# బంగాళదుంపతో ఫేస్ మారిపోద్ది..ఎలాగంటే...



**హైదరాబాద్ పెన్ పవర్:**బంగాళదుంప రసం చర్మ సంరక్షణ కోసం ఉపయోగపడుతుంది. ఇందులోని ఎంజైములు. విటమిన్లు. మినరల్స్. చర్మానికి పోషణ అందిస్తాయి. అంతేకాకుండా అనేక చర్మ సమస్యలను దూరం చేయడంలో కూడా సహాయపడతాయి. బంగాళాదుంపతో మీ చర్మాన్ని ఎలా మెరిసేలా చేయవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

బంగాళదుంపను ప్రతి ఇంట్లో వంటకాలలో ఉపయోగిస్తూ ఉంటారు. బంగాళదుంపతో తయారు చేసే రుచికరమైన వంటకాల కారణంగా కూరగాయల రారాజు అని కూడా దీనిని పిలుస్తారు. బంగాళదుంప వంటకాలకు మాత్రమే కాకుండా చర్మ సంరక్షణలో కూడా అద్భుతాలు చేయగలుగుతుంది. బంగాళదుంపతో తయారు చేసిన ఫేస్ ప్యాక్‌లు చర్మాన్ని అందంగా మార్చడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా మచ్చలను తొలగించడంలో కూడా సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

బంగాళదుంప రసం యొక్క ప్రయోజనాలు

**మచ్చలను తగ్గిస్తుంది:** బంగాళదుంపలో ఉండే పోషకాలు ముఖంపై ఉన్న మచ్చలను తగిలిస్తాయి. బంగాళాదుంప రసం మొటిమల ఉత్పత్తిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. అంతేకాకుండా పిగ్మెంటేషన్ రాకుండా చూస్తుంది.

**చర్మాన్ని మెరిపిస్తుంది:** బంగాళదుంపలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. అంతే కాకుండా ముఖాన్ని కాంతివంతంగా మారుస్తుంది.

**కళ్ళ కింద నల్లటి వలయాలను తగ్గిస్తుంది:**బంగాళ దుంపలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కళ్ళ కింద నల్లటి వలయాలు తగ్గించడానికి సహాయపడతాయి. అంతే చర్మాన్ని మెరిసేలా చేస్తాయి.

**చర్మానికి మేలు:** బంగాళదుంప రసం చర్మానికి తేమను అందిస్తుంది. అంతేకాకుండా దురద, చికాకు వంటివి రాకుండా చేస్తుంది. ముఖాన్ని అందంగా కనిపించేలా చేస్తుంది.

**ఫేస్ ప్యాక్‌లు తయారు చేయు విధానం:**

బంగాళదుంప, తేనె ఫేస్ ప్యాక్: ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో బంగాళదుంప రసం, తేనెలను సమపాళ్లలో తీసుకుని కలుపుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. ఇది ఆరిపోయే వరకు అలాగే ఉంచి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇది చర్మానికి పోషణ అందిస్తుంది. అంతే కాకుండా చర్మాన్ని మృదువుగా కూడా చేస్తుంది.

**బంగాళదుంప, టమాటో ఫేస్ ప్యాక్:**బంగాళ దుంప రసం , టొమాటో రసాన్ని సమపాళ్లలో తీసుకుని మిక్స్ చేసి ముఖానికి అప్లై చేయాలి. ఈ ఫేస్ ప్యాక్ అప్లై చేసిన 15 నిమిషాల తర్వాత ముఖాన్ని కడుక్కోవాలి. ఇది ముఖంపై ఉన్న టాన్ తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖాన్ని అందంగా కనిపించేలా చేస్తుంది.

**బంగాళదుంప , పెరుగు ఫేస్ ప్యాక్:**ముందుగా బంగాళదుంప రసం, పెరుగులను సమపాళ్లలో తీసుకుని కలుపుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి 15 నుంచి 20 నిమిషాలు ఉంచండి.

ఆ తర్వాత కడిగేయండి. దీనివల్ల కళ్ళ కింద ఉన్న నల్లటి వలయాలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారాలంటే బంగాళదుంప రసం, తేనె, నిమ్మరసం సమపాళ్లలో తీసుకుని ముఖానికి పట్టించి 15 నుంచి 20 నిమిషాల తర్వాత కడిగేయాలి ఇలా చేయడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది.

# అద్భుతమైన పోస్టాఫీస్ స్కీం.. నెలనెలా రూ.9వేల పొందండి..



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రతి నెలా ఇన్‌కమ్ పొందాలని అనుకుంటున్నారా..ఎటువంటి రిస్క్ లేకుండా ఆదాయం పొందే ఆప్షన్ గురించి ఆలోచిస్తున్నారా?..అయితే మీకోసం అద్భుత అవకా శం..డబ్బుతోనే డబ్బు సంపాదించే అద్భుత అవకాశం లభిస్తోంది. సేవింగ్స్ చేసే వారికోసం మంచి రాబడిని అందించే స్కీం లను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. పోస్టాఫీసుల ద్వారా ప్రతి నెలా రూ. 9 వేలకు పైగా పొందొచ్చు. అకౌంట్‌లోకి వచ్చి ఈ డబ్బుల జమ అవుతాయి. పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ అదుబాటులో ఉంది. దీని ద్వారా ప్రతి నెలా కొంత ఆదాయం పొందొచ్చు. ఈ స్కీంలో మీరు రూ. 1000 నుంచి రూ. 9 లక్షల వరకు డబ్బులు పొదుపు చేసుకోవచ్చు. అదే జాయింట్ అకౌంట్ అయితే రూ. 15 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు.

పోస్టాఫీస్ స్కీమ్ మెచ్యూరిటీ గడువు ఐదేళ్లు. ప్రస్తుతం ఈ స్కీమ్‌పై 7.4 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. మీరు ఇన్వెస్ట్ చేసే మొత్తం ఆధారంగా మీకు వచ్చే రాబడి కూడా ఆధారపడి ఉంటుంది. ఎక్కువ పెడితే ఎక్కువ లాభం వస్తుంది.

ఉదాహరణకు మీరు రూ. 5 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే.. మీకు నెలకు రూ. 3 వేల వరకు వస్తాయి. అదే రూ. 9 లక్షలు పెడితే మీకు నెలకు రూ. 5,550 లభిస్తాయి. అదే రూ. 15 లక్షలు పెడితే మీరు నెలకు రూ. 9,250 వరకు పొందొచ్చు.

సింగిల్ అడల్ట్, జాయింట్ అకౌంట్, పిల్లల పేరుపై గార్డియన్స్, పదేళ్ల వయసు దాటిన పిల్లలు ఈ స్కీమ్‌లో అకౌంట్ తెరవొచ్చు. ఈ స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేసిన మొత్తంపై వచ్చే వడ్డీ రాబడి నేరుగా పోస్టాఫీస్ అకౌంట్‌లో జమ అవుతుంది. మీరు దాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. లేదంటే అలాగే కొనసాగించొచ్చు.

ఐదేళ్ల టెన్యూర్ అయిపోయిన తర్వాత పోస్టాఫీస్‌కు వెళ్లి అకౌంట్ క్లోజ్ చేసుకోవచ్చు. ఒకవేళ డిపాజిట్ దారుడు మరణిస్తే.. అప్పుడు అకౌంట్ క్లోజ్ అవుతుంది. నామినీ లేదా కుటుంబ సభ్యులకు మొత్తాన్ని చెల్లిస్తారు.

## మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:**అర్హులైన ప్రతి జర్నలిస్టును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు మంత్రి పొంగులేటి. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో %జీచీజీను%కు భూమిపత్రాల అందజేత కార్యక్రమానికి సీఎం చీఫ్ గెస్టుగా హాజరయ్యారు. 1105 మంది జర్నలిస్టులకు 35 ఎకరాల్లో పేట్ బషీర్ బాగ్ దగ్గర ఇంటిస్థలం కేటాయించారు.

తమది మాటల ప్రభుత్వం కాదని..చేతల ప్రభుత్వమన్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు స్వేచ్ఛ అనేది లేదన్నారు. ప్రభుత్వం ఏ మంచిపనిచేసినా.. బీఆర్ఎస్ విమర్శించడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు మంత్రులు.

# దుండిగల్ లో విల్లాలను కూల్చేస్తున్న హైడ్రా

- భారీ బందోబస్తు మధ్య ఆదివారం తెల్లవారుజామున కూల్చివేతలు షురూ
- అన్ని చెరువులకూ చెర వదిలించాలంటున్న స్థానికులు
- సున్నం చెరువులో అక్రమ నిర్మాణాల తొలగింపు



**హైదరాబాద్ పెన్ పవర్:**చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తోంది. భారీ నిర్మాణాలను, బడాబాబుల విల్లాలను సైతం కూల్చివేస్తోంది. తాజాగా మేడ్చల్ జిల్లాలోని దుండిగల్ మునిసిపాలిటీలో ఆదివారం కూల్చివేతలు ప్రారంభించింది. మల్లంపేట కత్వ చెరువులో అక్రమంగా నిర్మించిన విల్లాలను కూల్చివేస్తోంది. స్థానికుల ఫిర్యాదుతో ఇటీవల హైడ్రా చీఫ్ రంగనాథ్ ఈ ఏరియాలో పర్యటించారు.
శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ పేరిట ఎన్ఆర్ఐ విజయలక్ష్మి కత్వా చెరువు ఎఫ్టీఎల్/బఫర్ జోన్‌లలో అక్రమంగా విల్లాలు నిర్మించారని అధికారులు నిర్ధారించారు. నిర్మాణదారులు, కొనుగోలుదారులకు నోటీసులు ఇచ్చారు. ఆదివారం ఉదయం పోలీసు బలగాల భద్రత మధ్య, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో కూల్చివేత పనులు మొదలయ్యాయి. ఈ కూల్చివేతలను స్వాగతించిన స్థానికులు.. దుండిగల్ లోని మిగతా చెరువులకు పట్టిన చెర విడిపించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

**సున్నం చెరువులో..**

మరోవైపు, శేరిలింగంపల్లి, బాలానగర్ మండలాల పరిధిలోని సున్నం చెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగిస్తోంది. దాదాపు 26 ఎకరాల్లో విస్తరించిన సున్నం చెరువు ఆక్రమణల కారణంగా కుచించుకుపోయి 2013 నాటికే 15.23 ఎకరాలుగా ఉంది. చెరువు ఫుల్ టాంక్ లెవెల్ (ఎఫ్ టీఎల్) పరిధిలోనే సర్వే నెంబర్ 13, 14, 16 ఉన్నట్లుగా అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో 2014 మే 14న సున్నం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను నిర్ధారిస్తూ అధికారులు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఎఫ్ టీఎల్ పరిధిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే, ఈ ఫెన్సింగ్ ను కొందరు ముందుకు జరిపి స్థలాన్ని ఆక్రమించుకోగా, మరికొందరు ఫెన్సింగ్ పూర్తిగా తొలగించి యథేచ్ఛగా కబ్జా చేశారు. ఏకంగా రోడ్డు కూడా నిర్మించి భవనాలు కట్టుకున్నారు. దీనిపై గతేడాది శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ చెరువులోని ఆక్రమణలను తొలగించే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఆదివారం ఉదయం నుంచి కూల్చివేతలు మొదలుపెట్టింది.

# యూట్యూబ్ లో చూసి ఆపరేషన్ చేసిన నకిలీ వైద్యుడు.. బీహార్ లో బాలుడి మృతి

## వాంతులు అవుతున్నాయని వెళితే ఆపరేషన్ చేశాడంటున్న తల్లిదండ్రులు

## తమ అనుమతి కూడా తీసుకోలేదని వెల్లడి

## బాబు ఆరోగ్యం విషమించగా వేరే ఆసుపత్రికి తరలించే యత్నం

## మార్గమధ్యలోనే బాలుడు మృతి.. పరారీలో వైద్యుడు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ లో నకిలీ వైద్యుడు ఒకరు యూట్యూబ్ లో చూసి ఆపరేషన్ చేశాడు.. పద్నాలుగేళ్ల బాలుడిపై ఆయన చేసిన ప్రయోగం వికటించింది. బాలుడి ఆరోగ్యం విషమించడంతో అంబులెన్స్ లో వేరే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశాడు. మార్గమధ్యలోనే బాలుడు చనిపోవడంతో నకిలీ వైద్యుడు పారిపోగా.. మృతదేహంతో తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. బీహార్ లోని సారణ్ జిల్లాలో చోటుచేసుకుందీ దారుణం.. జిల్లా కేంద్రానికి చెందిన 15 ఏళ్ల బాలుడు కృష్ణ కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. పదే పదే వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కుమార్ ను గణపతి హాస్పిటల్ కు తీసుకెళ్లారు.
ఆసుపత్రిలో చేర్పించిన కాసేపటికే కుమార్ వాంతులు తగ్గిపోయాయి. అయితే, అక్కడి వైద్యుడు అజిత్ కుమార్ పురి మాత్రం ఆపరేషన్ చేయాలని చెప్పాడు. వాంతులు తగ్గిపోయాయి కదా అని అడిగినందుకు తమపై కేకలు వేశాడని, డాక్టర్ నేనా, మీరా అని ఆగ్రహం వ్యక్తం చేశాడని కృష్ణ కుమార్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. ఆపై తమ అనుమతి తీసుకోకుండానే యూట్యూబ్ లో చూస్తూ ఆపరేషన్ మొదలు పెట్టాడని వివరించారు. ఆ తర్వాత కృష్ణ కుమార్ పరిస్థితి విషమంగా మారడంతో అంబులెన్స్ లో పాట్నాలోని పెద్దాసుపత్రికి తరలించే ప్రయత్నం చేశాడన్నారు. కొంతదూరం వెళ్లాక కృష్ణకుమార్ చనిపోవడంతో అంబులెన్స్ ను వెనక్కి తిప్పారని చెప్పారు.తిరిగి ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చి మృతదేహాన్ని మెట్లపై వదిలేసి డాక్టర్ అజిత్ కుమార్ పురి పారిపోయాడన్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహానికి గురైన బాధితుడి తల్లిదండ్రులు, వారి బంధువులతో కలిసి ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగేంత వరకూ మృతదేహానికి అంత్యక్రియలు చేయబోమని తేల్చిచెప్పారు. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ అజిత్ కుమార్ పురిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్ష పడేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ఐడియా అదిరింది:వాటర్ ట్యాంక్‌పై వినాయకుడి ప్రతిష్ఠ..పూజలు




**హైదరాబాద్ పెన్ పవర్:**గణపతి పండుగ వచ్చింది..మరోవైపు భారీ వర్షాలు కురుస్తున్నాయి..ఊరంగా ఎక్కడ చూసిన నీళ్లే..గణేషుని మండపం ఎక్కడ వేయాలి..రానున్న రోజుల్లో కూడా వర్షాలున్నాయి..గణేషుని పూజ నిర్వహణ తదితర కార్యక్రమాలు ఎలా సాగాలి..అనే సందేహాల మధ్య మనిషి తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు తెలంగాణలోని ఖమ్మం జిల్లా మురుమూరు గ్రామానికి చెందిన యూత్.. అనుకున్నదే ఆలస్యం..గణేషుని ప్రతిష్టించేందుకు వారికి ఓ ప్లేస్ గుర్తుకు వచ్చింది.. అదే.. ఊర్లో కామన్ గా ఉన్న వాటర్ ట్యాంక్.. ఇక్కడైతే గణేషును పూజకు ఏ వర్షాలు ఆటంకం కలిగించవు అని నిర్ధారించుకుని రంగంలో కి దిగారు.. వాటర్ ట్యాంక్ ఫస్ట్ ఫ్లోర్ లో ఏకంగా మంచి సెటప్ ఏర్పాటు చేసి విఘ్నేషుని ప్రతిష్టించారు.
వాటర్ ట్యాంక్ ఫస్ట్ ఫ్లోర్ లో సెంట్రింగ్ కొట్టించారు.. మెట్లు కూడా ఏర్పాటు చేశారు. భక్తులు వచ్చి గణనాధునికి పూజలు చేసి.. ఆశీర్వాదం తీసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశారు.. ఇక కాలక్షేపానికి ఓ డీజే సిస్టమ్ ను కూడా ఏర్పాటు చేశారు. విఘ్నేషుని మండల సెటప్ కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.. నెటిజన్లు యూత్ చేసిన ఆలోచనకు హ్యాట్సాఫ్ చెప్తూ.. తెగ కామెంట్లు పెగుతున్నారు..

# వరదనీటిలో చిక్కుకున్న భార్యభర్తలు.. కొన్ని గంటల శ్రమించి రక్షించిన రెస్క్యూ టీం



**హైదరాబాద్ పెన్ పవర్:**గుజరాత్ లోని సబర్ కాంత జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. నదిని దాటుతుం డగా.. వరద ఉధృతిలో ఓ కారు కొట్టుకుపోయింది.. కారులో ఉన్న భార్యభర్తలు భయంలో కేకలు పెట్టారు. వరదనీటిలో చిక్కుకున్న దంపతులు కారు పైకప్పుపై కూర్చొని హాహాకారాలు చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుజరాత్ లోని సబర్ కాంత జిల్లాలోని ఇదార్ పరిధిలో వడియావిర్, ఖుటియా గ్రామాల మధ్య ఈ సంఘటన జరిగింది. భార్యాభర్తలు ప్రయాణిస్తున్న కారు నది దాటుతుండగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. కారులోకి వేగంగా నీరు చేరడంతో మునిగిపోకుండా ఉండేందుకు పైకప్పు ఎక్కారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంలో వారిని కాపాడేందుకు సాధ్యం కాలేదు.. కొన్ని గంటల పాటు భార్యభర్తలు వరద నీటిలో బిక్కుబిక్కు మంటూ గడిపారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు సహాయం అందించేందుకు ప్రయత్నించారు. అయితే వరద తీవ్రత కారణంగా జంటను చేరుకోలేకపోయారు. విషయాన్ని అధికారులకు తెలియజేశారు.

రంగంలోకి దిగిన స్థానిక అగ్నిమాపక దళం వరదనీటిలో చిక్కుకున్న జంటను కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఇదార్, హిమ్మత్ నగర్ అగ్నిమాపక దళాలు, పోలీసులు , స్థానిక వాలంటీర్లతో జంటను చేరుకోగలిగారు. ఎంతో శ్రమించి జంటను సురక్షితంగా వరద నీటినుంచి బయటికి తీసుకురాగలిగారు.

## వినాయక మండపంలో విద్యుత్ షాక్.. యువకుడు మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:** గణేష్ పండుగ వేళ..నల్లకుంటలో విషాదం చోటుచేసుకుంది.నల్లకుంట పరిధిలోని రైల్వే ట్రాక్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కరెంట్ షాక్ తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. నల్లకుంట రైల్వే ట్రాక్ సమీపంలోని నారాయణ కాలేజీ ఎదురుగా కొంతమంది యువకులు శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం ఏర్పాటు చేశారు. ఆదివారం మండపం వద్ద ఉన్న లౌడ్ స్పీకర్ పాడైపోవడంతో యువకులు దానికి మరమ్మతులు చేయించారు. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో మర మ్మ తు చేసి తీసుకొచ్చిన లౌడ్ స్పీకర్ ను అసోసియేషన్ సభ్యుడైన పద్మ కాలనీకి చెందిన పాండు(26) మండపంపైన ఫిట్ చేసి కరెంట్ కనెక్షన్ ఇస్తున్నాడు. అయితే అక్కడ వేలాడుతున్న కరెంటుతీగ పాండుకు తగలడంతో అతను విద్యుత్ ఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్నేహితులు అతడిని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా అప్పటికే పాండు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నల్లకుంట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వెరైటీ వినాయకుడు.. కాయిన్స్ గణపతి.. బారులు తీరిన భక్తులు



**హైదరాబాద్ పెన్ పవర్:**వినాయక చవితి వచ్చింది అంటే ముందుగా గుర్తొచ్చేది.. బొజ్జ గణపయ్య బుజ్జి బుజ్జి బొమ్మలే. ఏ ఊరు చూసినా ఆ గణనాయకుడి విగ్రహాలే. వీధివీధినా వెరైటీ విగ్రహాలతో మూషిక వాహనుడు మనకు దర్శనమిస్తాడు. అందుకే వినాయక చవితి వచ్చిందంటే రాష్ట్రంలో ఉన్న వెరైటీ వెరైటీ ఆలోచనలన్నీ బయట పడుతుంటాయి. ట్రెండ్‌కి తగ్గట్టు కూడా వినాయకుడిని మలుస్తుంటారు.

యాదాద్రి జిల్లా భువనగిరిలో సర్దార్ సిద్ధార్థ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముప్పై వేల రూపాయల విలువ చేసే ఒక. రూపాయి ,పది రూపాయల కాయిన్లతో వినాయకుడిని తయారు చేయించి పూజలు నిర్వహిస్తున్నారు భక్తులు.. ప్రతి సంవత్సరం డిఫరెంట్‌గా వినాయక ప్రతిమలను రూపొందిస్తుంటారు. అయితే ఈసారి ఇంకాస్త వినూత్నంగా ముందుకెళ్లి ఏకంగా వేలాది రూపాయల కాయిన్స్ తో వినాయక ప్రతిమను తయారు చేశారు. ఇందుకోసం ఒక్కరూపాయి, 10 రూపాయాల నాణేలతో వినాయక ప్రతిమను రూపొందించారు. అయితే మొత్తం 30వేల రూపాయలు వెచ్చించి, 10 రోజులపాటు శ్రమించి ప్రతిమను రూపొందించినట్టు నిర్వాహకులు తెలిపారు. రూపాయి నాణాలతో వినూత్నంగా రూపొందించిన వినాయకుడిని చూసేందుకు పట్టణవాసులు ఎగబడుతున్నారు.